సాక్షి మహబూబ్‌నగర్

శుక్రవారం ; 5 ; ఏప్రిల్ ; 2024

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-37 (శుక్రవారం సాయంత్రం)

సహర్ 4-47 (శనివారం తెల్లవారుజామున)



..అనుమతివ్వండి

ఆర్కియాలజికల్ అధికారికి అలంపూర్ అధికారులు వినతిపత్రం అందించారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 42.5 /21.6

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఫైన్ ఆర్ట్స్ (ఎఫ్‌ఏఎస్)పాఠశాలలో ఆరో తరగతిలో చేరేందుకు ఆసక్తి గల బాలబాలికలు దరఖాస్తు చేసుకోవాలని టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ ప్రాంతీయ సమన్వయకర్త ఫ్లోరెన్స్‌రాణి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు www.tswreis.ac.in ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 18వ తేదీలోగా దరఖాస్తులు పంపుకోవాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్రవేశ పరీక్ష మే 5న నిర్వహిస్తామన్నారు.

మొబైల్ నిఘా నేత్రం



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో అధికారులు ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తారు. అయితే ఈసారి మరింత పకడ్బందీగా చేపట్టేందుకు ఏకంగా వాహనాలకు సీసీ కెమెరాలు పెట్టి మరి నిఘా పెట్టారు. అభ్యర్థుల ప్రచారం, సమావేశాలు, ర్యాలీలపై నిఘా కోసం వీడియో సర్వేలైన్సు టీం వాహనాలకు వీటిని బిగించారు. 24 గంటలపాటు ఈ కెమెరా ఆన్‌లోనే ఉంటుంది. ఈ నెల 18న పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ రానుంది. ఈ నేపథ్యంలోనే ఆయా పార్టీల అభ్యర్థులపై పూర్తి స్థాయిలో నిఘా పెట్టనున్నారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన వాహనాలు పార్టీల అభ్యర్థుల ర్యాలీలు, సమావేశాలు, ప్రచారం వంటివి చిత్రీకరిస్తాయి.

ఇంటి వద్దకే రాములోరి తలంబ్రాలు

- రూ.151తో ఆర్టీసీ కార్గో ద్వారా పంపిణీ
- ఈ నెల 17 వరకు బుకింగ్ అవకాశం



స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీరామనవమిని పురస్కరించుకొని భద్రాచలంలో జరగనున్న సీతా రామచంద్రుల కల్యాణ మహోత్సవ తలంబ్రాలు భక్తులకు అందించడానికి ఆర్టీసీ సంస్థ ప్రత్యేక చర్యలు తీసుకుంటుంది. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా తెలంగాణ దేవాదాయ శాఖ సహకారంతో రాములోరి తలంబ్రాలను ఇంటి వద్దకే చేర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎంతో పవిత్రంగా భావించే ఈ తలంబ్రాలు కావాలనుకునే భక్తులు టీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్ కేంద్రాల్లో రూ.151 చెల్లించి వివరాలు నమోదు చేసుకుంటే సీతారాముల కల్యాణం అనంతరం ఆర్టీసీ సంస్థ వాటిని ఇంటి వద్దకే అందజేస్తుంది.

ఈ నంబర్లు సంప్రదించండి

ఈ నెల 17 వరకు తలంబ్రాల కోసం భక్తులు బుకింగ్ చేసుకోవచ్చు. బుకింగ్ కోసం భక్తులు మహబూబ్‌నగర్- 91542 98612, గద్వాల- 91542 98609, నారాయణపేట- 96189 65885, షాద్‌నగర్- 91542 98615, వనపర్తి- 91542 98616, అచ్చంపేట- 91542 98608, కల్వకుర్తి- 91542 98610, కొల్లాపూర్- 91542 98611, నాగర్‌కర్నూల్- 91542 98613 నంబర్లను సంప్రదించవచ్చు.

బుకింగ్ మొదలైంది..

భద్రాచలం తలంబ్రాలకు సంబంధించి బుకింగ్ మొదలైంది. భక్తులు ఆయా డిపోల పరిధిలోని కార్గో లాజిస్టిక్ ద్వారా బుకింగ్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ ద్వారా కూడా డబ్బులు చెల్లించి పేరు నమోదు చేసుకొని రశీదు పొందవచ్చు. సీతారాముల కల్యాణం అనంతరం మా సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి తలంబ్రాలు అందిస్తారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలి.

– దేవేందర్‌రెడ్డి, ఆర్టీసీ లాజిస్టిక్ ఏటీఎం, మహబూబ్‌నగర్- మెదక్

రంజాన్ ఉపవాసాల్లో.. మానవీయ కోణం

- దైవానుగ్రహం కోసం ప్రత్యేక నమాజులు
- నేడు జమాతుల్ విదా ప్రార్థనలు
- భక్తిశ్రద్ధలతో షబేఖదర్ వేడుకలు

– స్టేషన్ మహబూబ్‌నగర్

- వివరాలు 8లో..



గండేడ్ మండలం పగిడ్యాల్‌కు చెందిన రైతు అమినికుంట్ల చిన్న బసప్ప తనకున్న ఎకరా పొలంలో మూడేళ్ల కిందట డ్రాగన్ ఫ్రూట్ పండ్లతోట నాటాడు. బోరు, ఫెన్సింగ్, డ్రిప్, మొక్కల కోసం మొత్తం రూ.8 లక్షలు ఖర్చయ్యింది. మూడేళ్లలో వచ్చిన పంటను అమ్మితే ఇప్పటి వరకు కేవలం రూ.3.50 లక్షల ఆదాయం వచ్చింది. అయితే ఈసారి 20 రోజుల కిందటే బోరు పూర్తిగా ఎండిపోయింది. దీంతో చేసేదేమీ లేక చేతికొచ్చిన పంటను కాపాడుకునేందుకు పక్క రైతుకు చెందిన బోరు నీటిని వాడుకుంటున్నాడు. వారానికి ఒకసారి నీటితడి పెట్టాల్సి ఉండగా నీరు లేక 12– 15 రోజులకోసారి పెట్టాల్సి వస్తోందని, దీంతో దిగుబడి తగ్గుతోందని ఆందోళన చెందుతున్నాడు.



రాజాపూర్ మండలం మల్లేపల్లి పంచాయతీ పరిధిలోని సోమ్లతండాకు చెందిన బీక్యానాయక్ తనకున్న నాలుగు ఎకరాలలో వరి పంట సాగు చేశాడు. ఇందుకు విత్తనాలు, ఎరువులు, కూలీలు, దుక్కి దున్నడం తదితర ఖర్చులకు గాను రూ.లక్ష దాక ఖర్చు చేశాడు. తీరా పంట చేతికి వచ్చే సమయానికి పొలంలో ఉన్న రెండు బోర్లు ఎండిపోయాయి. సాగు చేసిన పంట కళ్లముందే ఎండిపోతుంటే చేసేదేమీ లేక పశువులను మేపుతున్నాడు. ప్రభుత్వం ఎలాగైనా తమకు సహాయం అందించి ఆదుకోవాలని రైతు బీక్యానాయక్ వాపోయాడు.



ఈ ఫొటోలో కనిపిస్తున్నది నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలం తిమ్మాయిపల్లి రైతు సీమర్ల లక్ష్మయ్యకు చెందిన దోసకాయ పంట. తనకున్న ఎకరాలో భూమిలో ఈసారి దోస పంట సాగుచేశాడు. విత్తనాలు, మందులు, దున్నడం కోసం రూ.40 వేల దాకా ఖర్చయింది. అయితే వర్షాభావ పరిస్థితులతో నీరు అడుగంటి బోరు ఎండిపోవడంతో దోస పంట ఎండిపోయింది. గతేడాది పంటకు రూ.70 వేల వరకు ఆదాయం వస్తే ఈసారి మాత్రం పెట్టుబడి కూడా రాలేదని రైతు ఆందోళన చెందుతున్నాడు. కళ్ల ముందు ఎండిపోయిన పంటను కాపాడుకునే మార్గం లేక పశువులను మేపుతున్నానని చెబుతున్నాడు.

కష్టం.. నష్టం

ఉమ్మడి జిల్లాలో కరువుఛాయలు

- ఎటుచూసినా వట్టిపోయిన బోర్లు, ఎండిపోయిన పంటలే దర్శనం
- నీరు లేక వరి, పండ్ల తోటల రైతులకు అపార నష్టం
- పెట్టుబడులు కూడా రావని అన్నదాతల ఆవేదన
- ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకోలు

గ్రౌండ్ రిపోర్ట్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, వేసవికి ముందే భూగర్భజలాలు అడుగంటడంతో ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. నీరు లేక వరి పైర్లు నెర్రెలు బారుతున్నాయి. బోర్ల ఆధారంగా వరి, పత్తి, మిరప, మామిడి పంటలు సాగుచేసిన రైతులు వేసవి ప్రారంభంలోనే నీరులేక బోర్లు అడుగంటిపోవడంతో పంటలు ఎండి తీవ్రంగా నష్టపోతున్నారు. ఈసారి పెట్టుబడి ఖర్చులు సైతం రావని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

బోసిపోయిన కృష్ణమ్మ

ఉమ్మడి జిల్లాలోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టుల్లో ఈసారి చుక్కనీరు కనిపించడం లేదు. కృష్ణానది సీజన్ ప్రారంభం నుంచే నీరు లేక బోసిపోయింది. ఫలితంగా సాగునీటి కాల్వల్లో నీరు లేక, భూగర్భ జలాలు అడగంటిన కారణంగా బోర్లు సైతం వట్టిపోయాయి. వరికే కాక కూరగాయలు, ఇతర ఆరుతడి పంటలకు సైతం నీరందించలేని దుస్థితి నెలకొంది. దీంతో రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టి పంట చేతికి వచ్చే సమయంలో.. కళ్లెదుటే పంటలు ఎండిపోతుండటంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలో పడ్డారు.



అచ్చంపేట మండలం నడింపల్లిలో నీరు లేక నెర్రెలిచ్చిన వరి పంట



గండేడ్ మండలం పగిడ్యాల్‌లో వట్టిపోయిన బోరు

లక్ష ఎకరాల్లో ఎండిన పంటలు

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ యాసంగి సీజన్‌లో మొత్తం 8,04,641 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగైనట్లు అధికారిక రికార్డులు చెబుతున్నాయి. ఇందులో ప్రధానంగా వరి 5,34,150 ఎకరాల్లో సాగైంది. భూగర్భజలాలు అడుగంటిపోవడం, బోర్లు వట్టిపోవడంతో నీరందక ఇప్పటి వరకు అన్ని పంటలు కలిపి లక్షకు పైగా ఎకరాల్లో ఎండినట్లు వ్యవసాయ శాఖ అనధికార అంచనా. ఇందులో వివిధ రకాల కూరగాయలకు సంబంధించి ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 4,769 ఎకరాల్లో సాగు కాగా.. 250 ఎకరాల్లో ఎండిపోయినట్లు తెలుస్తోంది. అదేవిధంగా మామిడి తదితర పండ్ల తోటలు 90,239 ఎకరాల్లో సాగు కాగా.. సగానికి దిగుబడి తగ్గే అవకాశం ఉన్నట్లు రైతులు చెబుతున్నారు.



రాజాపూర్ మండలం మల్లేపల్లిలో ఎండిన జొన్న పంటను పశువులకు మేపుతున్న మహిళ సాంకి

కాపాడుకునేందుకు అష్టకష్టాలు..

ఆరుగాలం కష్టించి పండించిన పంటలు చివరి దశలో నీరు లేక ఎండిపోతుండటంతో పంటను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. పండ్ల తోటలు, కూరగాయల సాగు కోసం స్ప్రింక్లర్ల సహాయంతో పంట తడుపుతున్నా చివరి వరకు సరిపోవడం లేదని చెబుతున్నారు. మామిడి, మిరప, పండ్ల తోటలకు నీరు లేకపోవడంతో దిగుబడి సగానికి పరిమితమవుతోందని, దీంతో పెట్టుబడులు కూడా మిగలవని రైతులు వాపోతున్నారు.

పెట్టుబడి కూడా రాలేదు..



నేను నాలుగెకరాలు కౌలుకు తీసుకుని పత్తి పంట సాగు చేశా. కౌలు కోసం రూ.8 వేలు, దుక్కి దున్నడం, ఎరువులు, కలుపు ఖర్చుల కోసం ఇప్పటికే రూ.1.20 లక్షలు ఖర్చయ్యింది. ఈసారి వర్షాలు పడక, సాగునీటి వసతి లేకపోవడంతో పత్తి పంట ఎండిపోయింది. నాలుగెకరాలకు 20 క్వింటాళ్ల వరకు దిగుబడి రావాల్సి ఉండగా, పదిన్నర క్వింటాళ్లే వచ్చింది. పంట కోసం పెట్టుబడి రూ.1.20 లక్షలు అయితే వచ్చిన ఆదాయం రూ.71 వేలే. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలి.

– బోయిని అంజిలయ్య, రైతు, కష్లాపూర్, గండేడ్ మండలం

పంట మొత్తం ఎండింది..



నాకున్న 6 ఎకరాల భూమిలో 2 ఎకరాలు వరి పంట సాగు చేశాను. ప్రస్తుతం పంట గింజ దశలో ఉంది. ఇంకో 20 రోజులైతే పంట చేతికి వచ్చేది. అయితే నీరు లేక బోరు ఎండిపోవడంతో పంట మొత్తం ఎండిపో యింది. పంట పండితే కనీసం రూ.లక్ష వర కు ఆదాయం వచ్చేది. ఇప్పుడు ఎండిపోవడంతో ఇప్పటికే పెట్టిన ఖర్చులు రూ.50వేలు కూడా నష్టపోయాను. 20 ఏళ్ల కింద 360 ఫీట్ల లోతులో వేసిన బోరు ఈ ఏడాది ఎండిపోయింది. ప్రభుత్వం స్పందించి నష్టపోయిన పంటకు పరిహారం అందించాలి.

– పసుల అరవింద్‌రెడ్డి, రైతు, నడింపల్లి, అచ్చంపేట మండలం



ఉప్పునుంతలలో నీటి తడి లేక ఎండిన టమాట తోట

ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై సీ విజిల్ యాప్ ద్వారా వచ్చిన ఫిర్యాదులను 100 నిమిషాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు పరిష్కరించాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవినాయక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహబూబ్‌నగర్, దేవరకద్ర, జడ్చర్ల నియోజకవర్గాలకు సంబంధించి 27 ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలకు సీ విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధించి ఎన్ఐసీ అధికారి, డీఐఓ సత్యనారాయణమూర్తి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల పాత్ర చాలా ముఖ్యమైనదన్నారు. పనిపై ఎక్కువ దృష్టి పెట్టాలని చెప్పారు. సీ విజిల్ యాప్‌లో వచ్చిన ఫిర్యాదులే కాకుండా మోడల్ కోడ్ నిబంధనలు, ఉల్లంఘన, ఓటర్ల ప్రలోభాలు, రాజకీయ పార్టీల డబ్బు, మద్యం పంపిణీ వంటి చర్యలతోపాటు అభ్యర్థుల దుష్ప్రవర్తనపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే వాటికి సంబంధించిన ఫొటో, వీడియోలను తీసి సీ విజిల్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తే ఎన్నికల అధికారులకు చేరుతుందన్నారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లో సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాల వాహనాలను జీపీఎస్ కెమెరా ద్వారా కంట్రోల్ రూం నుంచి పర్యవేక్షిస్తామన్నారు. సీ విజిల్ యాప్‌లో పంపిన ఫొటోలు, వీడియోలు నేరుగా ఎన్నికల సంఘం అధికారులకు చేరుతాయన్నారు. ఎవరైనా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, డీఎఫ్ఓ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మీసేవా ద్వారా వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. గురువారం తన చాంబర్ నుంచి జిల్లాలోని రెవెన్యూ అధికారులతో సమీక్షించారు. రెవెన్యూ పరమైన అంశాలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరించి నివేదిక సమర్పించాలన్నారు. మీసేవా ద్వారా వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించాలని చెప్పారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో భాగంగా ఓటరు జాబితాలో చేర్పులు, మార్పుల దరఖాస్తులు, ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయరాదన్నారు. పార్లమెంటు ఎన్నికలకు సంబంధించి పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాట్లు, ఇసుక పెనాల్టీలు, ఇసుక లభ్యత తదితర అంశాలపై సమీక్షించారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రుతి ఓజా, చిత్రంలో కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ న్యూటౌన్: వేసవి ఎండలు తీవ్రంగా ఉన్న దృష్ట్యా ప్రజలకు తాగునీటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రత్యేకాధికారి, ఇంటర్మీడియట్ డైరెక్టర్ శ్రుతి ఓజా అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ రవినాయక్, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌తో కలిసి మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్, పబ్లిక్ హెల్త్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు, పట్టణాల్లో తాగునీటి వనరులు, డిమాండ్, మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సరఫరా, ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆరాతీశారు. తాగునీటి సమస్య వస్తే వెంటనే పరిష్కారం చూపాలన్నారు. కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి సమస్య రాకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తాగునీటి సమస్య పరిష్కారానికి నోడల్ అధికారిగా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్‌ను నియమించినట్లు చెప్పారు. గ్రామస్థాయిలో పంచాయితీ కార్యదర్శి, గ్రామ ప్రత్యేకాధికారి, మండల, మున్సిపాలిటీలో జిల్లాస్థాయి అధికారులు పర్యటించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం నీటి సమస్య లేదన్నారు. మిషన్ భగీరథ ద్వారా సరఫరా చేస్తున్న తాగునీటి పైప్‌లైన్ ఎక్కడైనా మరమ్మతు ఉంటే వెంటే పునరుద్ధరిస్తున్నట్లు వివరించారు. శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి జిల్లాకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 441 గ్రామాలు, 882 శివారు గ్రామాలకు 100 ఎల్‌పీసీడీ చొప్పున ప్రతిరోజు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. మార్చి 7 నుంచి 15 వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని, దీనిపై నివేదిక తయారు చేశామన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ ఎస్ఈ వెంకటరమణ, ఇంట్రా ఈఈ పుల్లారెడ్డి, గ్రిడ్ ఈఈ వెంకటరెడ్డి, పబ్లిక్‌హెల్త్ ఈఈ విజయభాస్కర్‌రెడ్డి, డీపీఓ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. అనంతరం మహబూబ్‌నగర్ మండలం జైనల్లీపూర్, గాజులపేట, భూత్పూర్ మండలం నెహ్రూనగర్‌లో పర్యటించి తాగునీటి ఎద్దడిపై ప్రజలతో ఆరాతీశారు.

నేడు బాబుజగ్జీవన్‌రాం జయంతి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మాజీ ఉప ప్రధాని, మానవతావాది బాబు జగ్జీవన్‌రాం జయంతి వేడుకలను శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లాకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిర్వహిస్తున్నట్లు కలెక్టరేట్ నుంచి జారీ చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. ముందుగా తెలంగాణ చౌరస్తాలోని జగ్జీవన్‌రాం విగ్రహానికి కలెక్టర్ రవినాయక్ పూలమాల వేసి నివాళులర్పిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు, అన్ని కుల సంఘాల నాయకులు, పట్టణ పుర ప్రముఖులు పాల్గొనాలని కోరారు.


మద్దతుకు మించి ధరలు

- దేవరకద్రలో సోనామసూరి గరిష్టంగా రూ.2,532

దేవరకద్ర/జడ్చర్ల: దేవరకద్ర మార్కెట్ యార్డులో గురువారం జరిగిన టెండర్లలో సోనామసూరి క్వింటాల్ గరిష్టంగా రూ.2,532, కనిష్టంగా రూ.2,279 ధరలు నమోదయ్యాయి. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2,203 కన్నా మార్కెట్‌లోనే ఎక్కువ ధరలు వస్తున్నాయి. మద్దతు ధర కంటే గరిష్టంగా రూ.329, కనిష్టంగా రూ.76 అధికంగా వచ్చింది. అలాగే ఆముదాలు గరిష్టంగా రూ.5,700, కనిష్టంగా రూ.5,689 చొప్పున పలికాయి. ప్రస్తుతం కోయిల్‌సాగర్ ఆయకట్టు కింద వరి పంటలు కోతకు రావడంతో రైతులు పంట మార్పిడి తర్వాత నేరుగా మార్కెట్‌కు ధాన్యాన్ని అమ్మకానికి తెస్తున్నారు. గురువారం మార్కెట్‌కు 4 వేల బస్తాల ధాన్యం అమ్మకానికి వచ్చింది.

వేరుశనగ క్వింటాలు రూ.7,350

బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం వేరుశనగ క్వింటాలు గరిష్టంగా రూ.7,350, కనిష్టంగా రూ.5,708 ధరలు లభించాయి. అలాగే మొక్కజొన్న గరిష్టంగా రూ.2,238, కనిష్టంగా రూ.2,050, ఆముదాలు గరిష్టంగా రూ.5,808, కనిష్టంగా రూ.5,534, జొన్నలు గరిష్టంగా రూ.4,977, కనిష్టంగా రూ.4,957, వరిధాన్యం ఆర్ఎన్ఆర్ రూ.2,211, రాగులు రూ.3,859 చొప్పున పలికాయి.



దేవరకద్ర మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన వరిధాన్యం

మహిళా సంఘాలకు.. యూనిఫాం కుట్టే బాధ్యత

ఈ సంవత్సరం నుంచి అప్పగించేందుకు నిర్ణయం

- ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్న అధికారులు
- మహిళాభ్యున్నతికి ప్రభుత్వం పెద్దపీట



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల యూనిఫాం కుట్టే బాధ్యత మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. తద్వారా మహిళలకు ఉపాధి కల్పించి ఆర్థికంగా బలోపేతం చేయాలని భావిస్తోంది. దీనికి సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలను ప్రభుత్వం ఆదేశించింది. దీంతో జిల్లాకు చెందిన ఆయా శాఖల అధికారులు ప్రతిపాదనలతోపాటు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

ఆసక్తి గలవారి గుర్తింపు..

జిల్లాలోని మహిళా సంఘాల్లో యూనిఫాం కుట్టేందుకు ఆసక్తి గల మహిళలను గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు గుర్తించే పనిలో పడ్డారు. ఇప్పటికే సెర్ప్ సీఈఓ కూడా తమ సిబ్బందితో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి క్లస్టర్ల వారీగా ప్రణాళిక తయారు చేయాలని ఆదేశించారు. కుట్టుమిషన్ ఉండి దుస్తులు కుట్టడం వచ్చిన వారితోపాటు నేర్చుకుని కుట్టేందుకు ఆసక్తి గల మహిళల వివరాలు నమోదు చేసుకుంటున్నారు. దీనికి అనుగుణంగా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

శిక్షణ ఇప్పిస్తాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు స్వయం సహాయక సంఘాల మహిళలకు స్కూల్ యూనిఫాంలు కట్టేందుకు అవకాశం కల్పిస్తున్నాం. కుట్టు పని వచ్చే వారి వివరాలు సేకరిస్తున్నాం. వారితో యూనిఫాం కుట్టించేందుకు సన్నద్ధం చేస్తున్నాం. వారికి అవసరమైన శిక్షణ ఇప్పిస్తాం. విద్యాశాఖ నుంచి వస్త్రం తెప్పించి ప్రభుత్వ ఆదేశాలు రాగానే కుట్టు పనిని ప్రారంభిస్తాం.

– నర్సింహులు, డీఆర్‌డీఓ

గ్రామైక్య సంఘాలు	స్వయం సహాయక సంఘాలు
485	11,695
సభ్యులు	1,24,695

ప్రారంభంలోనే అందించేలా..

జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత, కేజీబీవీ, ఆదర్శ, గురుకులాల్లో చదివే విద్యార్థులకు యూనిఫాంలు ఇస్తారు. అయితే వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి యూనిఫాం కుట్టించి విద్యార్థులకు అందించాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఇందులో భాగంగానే ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా దుస్తులు కుట్టేందుకు ఆసక్తి ఉన్నవారి వివరాలు సేకరించారు.

క్లుప్తంగా

పాఠశాలకు వెళ్తూ.. అనంతలోకాలకు

● ట్రాక్టర్ ఢీకొని విద్యార్థి దుర్మరణం


ప్రకాష్ (ఫైల్)

కృష్ణా: సైకిల్‌పై పాఠశాలకు బయల్దేరిన ఓ విద్యార్థిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈవిషాదకర ఘటన కృష్ణా మండలం ఆలంపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు ఆలంపల్లికి చెందిన కావలి హన్మేష్ కుమారుడు ప్రకాష్ (14) కున్సి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. రోజు మాదిరిగానే గురువారం సైకిల్‌పై పాఠశాలకు బయల్దేరగా.. గ్రామ సమీపంలో పత్తి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో ప్రకాష్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘటనా స్థలానికి చేరుకొని కన్నీరు పెట్టుకున్నారు. విద్యార్థులకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో ఈ ఘటన చోటుచేసుకుందని గ్రామస్తులు వాపోయారు. విద్యార్థి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఈతకు వెళ్లిన యువకుడు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: బావిలో ఈతకు వెళ్లిన యువకుడు నీటిలో మునిగి మృతి చెందిన ఘటన మండలంలోని శ్రీపురంలో బుధవారం చోటు చేసుకోగా గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా.. శ్రీపురం చెందిన మహేష్ (24) కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈయన బుధవారం మధ్యాహ్నం గ్రామంలోని బావిలో ఈతకు వెళ్లాడు. గురువారం ఉదయం నీటిలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనపై మృతుడి తండ్రి బంగారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

బిజినేపల్లి: మండలంలోని వెంకటాపూర్ గ్రామ సమీపంలో గురువారం రోడ్డు ప్రమాదానికి గురై కృష్ణయ్య(65) మృతిచెందాడు. ఎస్‌ఐ నాగేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ మండలం నాగనూల్‌కి చెందిన కృష్ణయ్య, తన బైక్‌పై పాలెం నుంచి నాగర్‌కర్నూల్ వైపు వెళ్తున్నాడు. వెంకటాపూర్ దాటగానే కృష్ణయ్య ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు తెలియజేశారు.

వడదెబ్బకు గురై వృద్ధుడు..

లింగాల: మండల పరిధిలోని శ్రీరంగాపూర్‌కు చెందిన మర్రిపల్లి ఈరయ్య(70) వడదెబ్బకు గురై మృతిచెందిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగు చూసింది. బుధవారం వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి వెతికారు. అప్పటికే వృద్ధుడు మృతిచెందినట్లు గుర్తించారు. మృతుని భార్య అనంతమ్మ కొన్నేళ్ల కిందటే మృతిచెందింది.

అదనపు కట్నం తీసుకు రావాలని వేధింపులు

● భర్తతో పాటు అత్తామామలపై కేసు నమోదు

బల్మూర్: అదనపు కట్నం కోసం వేధించిన భర్తతో పాటు అత్తామామలపై బాధితురాలి ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజు తెలియజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రామాజిపల్లికి చెందిన భవానికి 2021లో బిజినేపల్లికి చెందిన అస్కని రామకృష్ణతో వివాహమైంది. పెళ్లి సమయంలో కట్నం కింద రూ.4 లక్షల నగదుతో పాటు 12 తులాల బంగారం పుట్టింటి వారు ఇచ్చారు. కాని ఇంకా అదనపు కట్నం తీసుకురావాలని రెండేళ్ల నుంచి భర్తతో పాటు అత్త అస్కని అజంత, మామ శ్రీనివాసులు వేధిస్తున్నారన్నారు. ఈ క్రమంలో నెల రోజుల కింద పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి అత్త ఇంటికి తీసుకెళ్లారు. కాని మళ్లీ అదనపు కట్నం తీసుకురావాలని తీవ్రంగా కొట్టి వేధించడంతో ఆమె ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వివరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో రూ.లక్ష ఆస్తి నష్టం

గద్వాల క్రైం: ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ సంభవించిన సంఘటనలో రూ.లక్ష ఆస్తి నష్టం చోటుచేసుకున్న సంఘటన పట్టణంలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అంబేద్కర్ సర్కిల్‌లో నివాసం ఉంటున్న శంకరయ్య ఇంట్లో గురువారం సాయంత్రం హై ఓల్టేజ్ విద్యుత్ సప్లయ్ అయ్యింది. ఈ క్రమంలో ఇంట్లోని స్విచ్ బోర్డులు, వైర్లలో ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో కుటుంబ సభ్యులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పారు. ప్రమాదంలో ఇంట్లోని వస్తు సామగ్రి, దుస్తులు మంటల్లో కాలిపోయాయి. ప్రధాన రోడ్డు మార్గంలో నివాసం ఉండటంతో పలువురు భయభ్రాంతులకు గురయ్యారు.

వసతుల కల్పనకు అనుమతివ్వండి


ఏఎస్‌ఐ సూపరింటెండెంట్ స్మితతో మాట్లాడుతున్న ఆలయ అధికారులు

● ఏఎస్‌ఐ సూపరింటెండెంట్‌కు జోగుళాంబ దేవస్థానం అధికారుల విజ్ఞప్తి

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలకు వచ్చే భక్తులకు మరిన్ని వసతులు కల్పించేందుకు అనుమతులు ఇవ్వాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లో ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్‌ఐ) సూపరింటెండెంట్ స్మితకు దేవస్థానం అధికారులు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన పనుల వివరాలను ఆలయ చైర్మన్ చిన్నకృష్ణయ్య, ఈఓ పురేందర్‌కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మలు వివరించారు. ప్రధానంగా భక్త యాత్రికుల కోసం ఆలయ ప్రాంగణంలో సమాచార కేంద్రం, డొనేషన్ కౌంటర్, లాకర్ రూం ఏర్పాటు చేసుకుంటామని సూపరింటెండెంట్‌ను కోరగా.. ఏఎస్‌ఐ నిబంధనల మేరకు నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. ఏ నిర్మాణాలు కూడా శాశ్వత కట్టడాలుగా ఉండరాదన్నారు. దీనిపై ఆలయ అధికారులు స్పందిస్తూ.. శాశ్వత కట్టడాలు కాకుండా, అధునాతన పద్ధతిలో ఒకచోట నుంచి మరో చోటికి తరలించేవిధంగా ఫైబర్ అండ్ గ్లాస్ రూంలు ఏర్పాటు చేసుకుంటామన్నారు. భక్తులకు నీడ కోసం మండపాలు ఏర్పాటు చేసుకుంటామని కోరగా.. తడకలతో ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కాగా, నవబ్రహ్మ, పాపనాశిని ఆలయాలు డెడ్ మాన్యూమెంట్స్ అని.. అక్కడ పూజా టికెట్లు, హుండీలు, పూజలు వంటి వాటికి అనుమతులను నిరాకరించారు. నవబ్రహ్మ ఆలయాల్లో కేవలం బాలబ్రహ్మేశ్వర ఆలయంలో మాత్రమే టికెట్, డొనేషన్ కౌంటర్ ఏర్పాటుకు అనుమతించారు. అదేవిధంగా పుష్కరఘాట్‌లో భోజనశాల, ప్రసాదం తయారీకి అవసరమైన నిర్మాణాలకు అనుమతులు కోరగా.. ఏఎస్‌ఐ నిబంధనల మేరకు అక్కడ ఎలాంటి వంటగ్యాస్‌లు, కట్టెల పొయ్యిలకు అనుమతులు ఉండవన్నారు. కొత్తగా నిర్మించిన ప్రసాద్ స్కీం భవనంలో తయారు చేసుకోవాలని సూచించారు. ఇక బాలబ్రహ్మేశ్వర ఆలయం ఎదుట ఉన్న నందిమండపంలో 1950–1960 మధ్య కాలంలో నిర్మించిన అదనపు కట్టడాలను తొలగించాలని.. ఈ నిర్మాణాలతో ప్రధాన ఆలయాన్ని భక్తులు గుర్తించలేక పోతున్నారని సూపరింటెండెంట్ దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఆమె స్పందిస్తూ.. తాము ఆలయానికి వచ్చి పరిశీలించి, నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అలంపూర్ ఆలయాల్లో సహజ నిర్మాణాలకు విరుద్ధంగా చేపట్టిన కట్టడాలతో యూనిస్కో గుర్తింపునకు దూరం అయినట్లు సూపరింటెండెంట్ స్మిత ఆవేదన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా కన్సర్వేషన్ అసిస్టెంట్ నవీన్ ఉన్నారు.

రంజాన్ ఉపవాసాల్లో మానవీయ కోణం


రైల్వేస్టేషన్ సమీపంలోని మసీదులో జుమా నమాజ్ చేస్తున్న ముస్లింలు

● దైవానుగ్రహం కోసం ప్రత్యేక నమాజులు
● నేడు జుమాతుల్ విదా నమాజు
● భక్తిశ్రద్ధలతో షబేఖదర్ వేడుకలు

స్టేషన్ మహబూబ్‌నగర్: రంజాన్ మాసం ఉపవాస దీక్ష పరులు జకాత్, ఫిత్రా పేర్లతో చేస్తున్న ప్రత్యేక దాన, ధర్మాలు మానవీయ కోణాన్ని తట్టి లేపుతాయి. నిరుపేదలకు తినుబండారాలు, వస్త్రాల పంపిణీతోపాటు ఆర్థికసాయం చేస్తూ ముస్లింలు దాతృత్వాన్ని చాటుకుంటున్నారు. దాహాగ్ని దహింపచేసే తీవ్రమైన వేసవి అయినా సరే రంజాన్ దీక్షకు మినహాయింపు ఉండదు. దైవానుగ్రహం కోసం రాత్రిపొద్దుపోయే వరకు చేస్తున్న తరావీ, తహజుద్ నమాజులు, ఖురాన్ పఠనంతో (ఇబాదత్‌లు) ముస్లిం కుటుంబాల్లో దైవికం ఉట్టిపడుతున్నది.

రంజాన్‌లో ప్రత్యేక నమాజులు..

ప్రతి రోజు ఐదు పూటలా నమాజు చేసే ముస్లింలు రంజాన్‌లో తరావీ, తహజుద్, సల్వాతుత్తజ్బీ ప్రత్యేక నమాజులు చేస్తారు. తరావీ నమాజ్‌లో 20 రకాత్‌లు ఉంటాయి. ఇషా నమాజ్ అనంతరం రాత్రి 9 గంటల నుంచి గంట లేక గంటన్నర పాటు ఈ నమాజ్ ఉంటుంది. తహజుద్ నమాజ్ రాత్రి 3 గంటల నుంచి 4గంటలలోపు నాలుగు లేక 8 రకాత్‌లు చేస్తారు. సల్వాతుత్తజ్బీ నమాజ్ రోజులో ఒక సారి, వారంలో ఒకసారి చదవాలి. ఇందులో మూడో కలిమా 300 సార్లు చదువుతారు. అత్యంత పుణ్యప్రదమైన ఈ నమాజు చాలా దోషాల నుంచి విముక్తి కలిగిస్తుందని ముస్లింల నమ్మకం.

నేడు జుమాతుల్ విదా నమాజు..

రంజాన్‌లోని చివరి శుక్రవారం చదివే నమాజును జుమాతుల్‌విదా అంటారు. నేడు జుమాతుల్ విదా పర్వదినం. ఈ జుమా నమాజును వేలాది మంది ఒకేసారి మసీదులో చదువుతారు. పవిత్రమైన రంజాన్ నెలలో తాము చేసిన ఉపవాసాలను అంగీకరించమని అల్లాను వేడుకుంటూ రంజాన్‌కు వీడ్కోలు పలికే ఈ నమాజు చాలా ప్రత్యేకతను సంతరించుకుంది. రంజాన్‌లోని మొదటి దశకం (పది రోజులు) క్షమాపణను ప్రసాదిస్తాయి. మూడో దశకం కఠిన శిక్షణ నుంచి విముక్తిని కలిగిస్తాయి.

భక్తిశ్రద్ధలతో షబేఖదర్ వేడుకలు..

రంజాన్‌లో షబే ఖదర్ (పెద్దరాత్రి) చాలా విశిష్టమైనది. ఈ నెలలోని 21, 23, 25, 27, 29 తేదీల్లోని రాత్రుల్లో అల్లా తన చివరి ప్రవక్త మహ్మద్ (స.అస) ద్వారా పంపిన సందేశాలు ఖురాన్ గ్రంథంగా అవతరించిందని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. ఈ ఒక్క రాత్రి చేసే నమాజ్ వల్ల వెయ్యి నెలల రాత్రుల నమాజ్ చేసే పుణ్యం సొంతమవుతుందని మతపెద్దలు చెబుతున్నారు. వీటిలో రంజాన్ నెల 27వ తేదీ (శనివారం) అతి ముఖ్యంగా జిల్లా వ్యాప్తంగా 'షబే ఖదర్' జాగరణ పాటిస్తారు. ముస్లింలు ఈ రాత్రి జాగరణ చేసి క్షమాబిక్షను కోరుతూ ఇంటిల్లిపాది ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

భక్తిశ్రద్ధలతో ఇబాదత్ చేయాలి



రంజాన్ నెల చివరి రోజుల్లోని ఐదు రాత్రులలో ఏదో ఒక రాత్రి లైలతుల్‌ఖద్ర్ రావచ్చు. వెయ్యి మాసాల రాత్రులతో సమానంగా రంజాన్‌లో వచ్చే లైలతుల్ ఖద్ర్. ఈ ఐదు రాత్రుల్లో అల్లాను ఒప్పించేలా భక్తిశ్రద్ధలతో ప్రతి నిత్యం ఇబాదత్, జికర్, తస్బీ, దురుదే షరీఫ్, అస్తగ్‌ఫార్ లాంటి పఠిస్తూ ఉండాలి. ఆ రోజు రాత్రి దువా చేస్తే దైవదూతలు ఆమీన్ అంటారు. లైలతుల్ ఖద్ర్‌న దువా చేసే వారి పాపాలను అల్లాతాలా క్షమిస్తారు.

– మౌలానా మొహసిన్‌పాష ఖాద్రీ, మహబూబ్‌నగర్

సమభావం పెంచే ఇఫ్తార్..

ఈ మాసంలో మసీదుల్లో దీక్షాపరులు నిర్వహించే సామూహిక ఇఫ్తార్ విందులు ముస్లిం సంప్రదాయానికి ప్రతీక. ఇఫ్తార్లకు ఇస్లాంలో ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. సామూహిక ఇఫ్తార్లతో మనుషుల మధ్య అనుబంధాలు పెరుగుతాయని మహ్మద్ ప్రవక్త (స.అ.స) పవిత్ర హదీసుల్లో పేర్కొన్నారు. పేద, ధనిక తేడాలు తొలిగిపోతాయి. హిందువులు ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేసి ముస్లింలను ఆహ్వానిస్తున్నారు. ఇఫ్తార్ విందు సోదర భావానికి ప్రతీకగా నిలుస్తున్నాయి.


జిల్లా కేంద్రంలో ఇఫ్తారు విందులో పాల్గొన్న ముస్లింలు

కరాటేతో దేహదారుఢ్యంతోపాటు మానసిక ఎదుగుదల

● వేసవి ఉచిత కరాటే శిబిరాల పోస్టర్లను ఆవిష్కరించిన హీరో సుమన్


శిక్షణ శిబిరాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హీరో సుమన్ తదితరులు

మహబూబ్‌నగర్ క్రీడలు: కింగ్‌షోటోకాన్ కరాటే డూ ఇండియా ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో ప్రతి ఏడాది ఏర్పాటు చేయనున్న వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరాల పోస్టర్లను గురువారం జిల్లా కేంద్రంలో హీరో సుమన్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ కరాటే మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం వల్ల దేహదారుఢ్యంతో పాటు మానసికంగా ఎదగవచ్చని అన్నారు. ఉచిత వేసవి కరాటే శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్న జహంగీర్ పాష ఖాద్రీని అభినందించారు. ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ మాట్లాడుతూ కింగ్‌షోటోకాన్ ఆధ్వర్యంలో 25 ఏళ్ల నుంచి వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది 26వ ఉచిత వేసవి ఉచిత కరాటే శిక్షణ శిబిరాలను జిల్లాకేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణ, షాసాబ్‌గుట్టలోని అల్ నూర్ స్కూల్‌లో వచ్చేనెల 2 తేదీ నుంచి జూన్ 2 వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ శిబిరాలను విద్యార్థులు, యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరాల్లో కరాటే, కిక్‌బాక్సింగ్, జూడో, బాక్సింగ్, యోగా, సెల్ఫ్ డిఫెన్స్, ఫిజికల్ ఫిట్‌నెస్‌పై శిక్షణ అందజేస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం బెల్టు గ్రేడింగ్ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యక్తితత్వ వికాస నిపుణులు లక్ష్మణ్, కరాటే మాస్టర్లు తాజుద్దీన్, కేశవ్‌గౌడ్, సీనియర్ కరాటే విద్యార్థి అర్ష్ జమీల్ తదితరులు పాల్గొన్నారు.

బాలికకు వివాహం: వరుడు, తల్లిదండ్రులపై కేసు నమోదు

అడ్డాకుల: బాలికకు పెళ్లి చేసిన ఘటనలో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు మూసాపేట ఎస్‌ఐ కె.సుజాత తెలిపారు. మండలంలోని కొమిరెడ్డిపల్లికి చెందిన ఆంజనేయులుకు అదే గ్రామానికి చెందిన బాలికతో వివాహం నిశ్చయమైంది. గురువారం పెళ్లికి ముందు ఈ విషయంపై ఐసీడీఎస్ అధికారులకు సమాచారం చేరింది. వెంటనే పోలీసుల సాయంతో ఐసీడీఎస్ అధికారులు పెళ్లి వద్దకు వెళ్లగా అప్పటికే పెళ్లి ముగిసింది. దీనిపై వరుడితో పాటు బాలిక తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.

బాలికపై లైంగిక దాడి

జడ్చర్ల: మండలంలోని ఓ తండాకు చెందిన బాలిక (5)పై బాలుడు (12) లైంగిక దాడికి పాల్పడ్డాడు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. తండాలోని పాఠశాల ఆవరణలో గురువారం తోటి పిల్లలతో కలిసి బాలిక ఆడుకుంటుండగా.. అదే తండాకు చెందిన బాలుడు చాక్లెట్లు ఇస్తానని ఆశ చూపి పక్కకు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. తీవ్రమైన నొప్పితో బాలిక ఇంటికి చేరుకోగా, కుటుంబ సభ్యులు ఆరా తీశారు. జరిగిన విషయాన్ని బాలిక చెప్పడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

154 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటి మట్టం గురువారం 1,012 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాల్వకు నీటిని నిలిపి వేయగా.. సమాంతర కాల్వ ద్వారా 154 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.

బీసీలను విస్మరించే పార్టీలను బొందపెట్టాలి

జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్


అచ్చంపేటలో మాట్లాడుతున్న జాజుల శ్రీనివాస్‌గౌడ్

అచ్చంపేట/తెలకపల్లి: బహుజనుల త్యాగాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర పరిపాలనలో బీసీ బహుజన కులాలకు పదవులు దక్కకుండా అగ్రవర్ణాల చేతుల్లోకి వెళ్లిందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గురువారం నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లిలో, అచ్చంపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 2, 3 శాతం లేనటువంటి అగ్రకులాలు రాజకీయ గుత్తాధిపత్యంతో పరిపాలిస్తున్నాయని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యత ఉండేదని, తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత బీసీల రాజకీయ ప్రాతినిధ్యం క్రమంగా తగ్గుతూ వస్తుందన్నారు. పాలమూరు జిల్లా అగ్రకులాలకు నిలయమైందని, జిల్లాలో 60 శాతం ఉన్న బీసీలను బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు బీసీలకు అణిచి వేస్తున్నాయన్నారు. కనీస సదుపాయాలు, అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాల్లో పదవులు బీసీలకు దక్కకపోవడం బాధాకరమన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నీళ్లు, నిధులు, నియామకాలతో మోసం చేసి గద్దెనెక్కి బహుజన కులాలను వెనకబాటుకు గురిచేసిందన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం స్వేచ్ఛ, సమానత్వం, ఆత్మగౌరవం పేరుతో అధికారంలోకి వచ్చి ఇందిరమ్మ పాలన పేరుతో మోసం చేస్తూ ఒకే సామాజిక వర్గానికి సంబంధించిన రెడ్ల రాజ్యం తీసుకువచ్చిందన్నారు. బహుజనులకు సామాజిక న్యాయం జరిగే వరకు ప్రతి బహుజనుడు ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు, పార్టీలు, కుల, మత సిద్ధాంతాలతో కాకుండా జనాభా దమాషా ప్రకారం బీసీ బహుజనులకు సామాజిక న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే బహుజనులను కూడగట్టుకుని ఉద్యమిస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షుడు నగేష్‌గౌడ్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేష్, ఎంబీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బడేసాబ్‌గౌడ్, తిరుపతయ్యగౌడ్, మండల నాయకులు పాల్గొన్నారు.

తెగిపడిన 11 కేవీ విద్యుత్ లైన్

● గంధం చెట్లు దగ్ధం.. రూ.కోటి ఆస్తినష్టం


కాలిపోయిన గంధం చెట్లు

జడ్చర్ల: మండలంలోని కోడ్గల్ గ్రామ శివారులో గురువారం ఆకస్మికంగా 11 కేవీ విద్యుత్ లైన్ తీగలు తెగిపడటంతో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నేలపై తీగలు పడిన సమయంలో ఎండుటాకులు నిప్పంటుకుని మంటలు చెలరేగాయి. సమీపంలోని రైతు నారాయణరెడ్డికి చెందిన ఫాంల్యాండ్‌లోకి మంటలు వ్యాపించి గంధం చెట్లు దగ్ధమయ్యాయి. మొత్తం 17 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేసిన దాదాపు 5 వేల గంధం చెట్లకు మంటలు వ్యాపించి ఆస్తి నష్టం జరిగిందని బాధిత రైతు తెలిపారు. పొలంలో పైపులైన్లు, డ్రిప్ సిస్టం వంటివి పూర్తిగా కాలిపోయాయని చెప్పారు. అలాగే సమీపంలోని మరో రైతు రాంరెడ్డికి చెందిన కోళ్ల ఫారం పరదాలు కూడా మంటలకు కాలిపోయి.. సుమారు రూ.కోటి వరకు ఆస్తినష్టం సంభవించి ఉంటుందని బాధిత రైతులు వాపోయారు. ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందించి తమను ఆదుకోవాలని వారు కోరారు. కాగా ఎండిన చెట్ల కొమ్మలు విరిగి 11 కేవీ విద్యుత్ లైన్‌పై పడడంతో తీగలు తెగిపడ్డాయని విద్యుత్ శాఖ ఏడీఈ శ్రీనివాసులు తెలిపారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని లైన్ పునరుద్ధరణ చర్యలు చేపట్టామని వివరించారు.

మహిళ కడుపులో కణతి తొలగింపు

శస్త్రచికిత్స చేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ


తొలగించిన కణితిని చూయిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: వృత్తిరీత్యా బిజీగా గడిపే స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేసి ఓ మహిళ కడుపులోని 10 కిలోల కణతిని తొలగించారు. వివరాలిలా.. బల్మూర్ మండలం మైలారం గ్రామానికి చెందిన అనిత ఏడాది నుంచి విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతుంది. పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించగా కడుపులో భారీ కణితి ఉందని తేలింది. దీంతో శస్త్రచికిత్స కోసం పెద్దమొత్తంలో డబ్బు ఖర్చు అవుతుందని చెప్పడంతో పలువురు ఈ విషయాన్ని ఎమ్మెల్యే వంశీకృష్ణకు చెప్పారు. గురువారం శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేయాలని అచ్చంపేట ప్రాంతీయ ఆస్పత్రిలోని వైద్యులకు ఎమ్మెల్యే చెప్పారు. ఆపరేషన్ థియేటర్‌లో స్థానిక వైద్యుల సాయంతో స్వయంగా ఎమ్మెల్యే మహిళకు శస్త్రచికిత్స చేసి కడుపులోని కణతిని తొలగించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో ఇప్పటికే ఎమ్మెల్యే మూడుసార్లు శస్త్రచికిత్స చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలోనే అన్ని వైద్య సేవలు అందుతున్నాయని, ప్రజలు, రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రభు, మహేష్, సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీల్లో పట్టుబడిన నగదు


రాజాపూర్ వద్ద పట్టుబడిన నగదు


నందిన్నె చెక్‌పోస్టు వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

అలంపూర్: రాష్ట్ర సరిహద్దులోని పుల్లూరు చెక్‌పోస్టులో వాహన తనఖీలలో భాగంగా ఇద్దరు వ్యక్తులు వేర్వేరు వాహనాలలో వెళ్తుండగా రూ.1,97,500 నగదును పట్టుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. గురువారం పుల్లూరు చెక్‌పోస్టులోని వాహన తనఖీలలో భాగంగా అయిజ మండలం ఉప్పలకు చెందిన జయకృష్ణ కర్నూల్ జిల్లా నుంచి హైదరాబాద్‌కు ప్రయాణిస్తుండగా అతని వద్ద ఎలాంటి ఆధారాలు లేని రూ.లక్ష నగదును పట్టుకున్నట్లు తెలిపారు. అనంతరం హిందుపూర్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న అరిష్‌వుల్లా వద్ద రూ.97,500 నగదును పట్టుకున్నారు. ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి కేసు నమోదు చేయగా నగదును జిల్లా గ్రీవేన్స్ సెల్ కార్యాలయానికి తరలించినట్లు తెలిపారు.

రాజాపూర్: మండల శివారులో గురువారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా హైదరాబాద్ నుంచి ఆత్మకూర్‌కు మూడు వాహనాల్లో వెళ్తున్న వెంకటేష్, రమేష్‌బాబు, షాలీభాషా వద్ద రూ.8,47,700 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రవి తెలిపారు.

గట్టు: మండల కేంద్రం, గొర్లఖాన్‌దొడ్డి మధ్యన గురువారం వాహన తనిఖీల్లో రూ.2.76 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. ఆరగిద్దకు చెందిన రవి నగదును తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె చెక్ పోస్టు వద్ద రాయచూర్ నుంచి ధరూర్ వస్తున్న రాములు వద్ద రూ.90 వేలు నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ చక్రవర్తి, సిబ్బంది తదితరులు ఉన్నారు.

అమరచింత: పట్టణంలో గురువారం వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా ప్రకాష్ నుంచి రూ.87వేల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ సురేష్‌కుమార్ తెలిపారు.

రేషన్ బియ్యం పట్టివేత

కృష్ణా: కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని గురువారం మండల సరిహద్దులోని కృష్ణా చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నట్లు ఎస్‌ఐ ఎండీ నవీద్ తెలిపారు. దౌల్తాబాద్‌కు చెందిన బొలెరో వాహనంలో 5 బస్తాల బియాన్ని కర్ణాటక వైపు తరలిస్తుండగా.. పట్టుకుని రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు పేర్కొన్నారు. బియ్యం వాహనాన్ని సీజ్ చేయడంతో పాటు యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీచుపల్లిలో ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన


పూజలు చేస్తున్న ఉడిపి పలిమార్ పీఠాధిపతులు

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి క్షేత్రంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో గురువారం ధ్వజస్తంభ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక వంశీయుడు డీకే భరతసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉడిపి పలిమార్ పీఠాధిపతులు విద్యాధీశ తీర్థులు, విద్యా రాజేశ్వర తీర్థ స్వాములు హాజరయ్యారు. ముందుగా అభయాంజనేయస్వామిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పీఠాధిపతుల శిష్య బృందంతో కలిసి వేద మంత్రోచ్ఛరణ మధ్య ధ్వజస్తంభాన్ని పునఃప్రతిష్ఠించారు. ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి రామన్‌గౌడ్, అర్చకులు పాల్గొన్నారు.